

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగిపై కత్తులతో దాడి

తిరుపతి క్రైం, మార్చి 23, ప్రభాతవార్త

తిరుపతి నగర మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగిపై గుర్తు తెలియని వ్యక్తులు గురువారం కత్తులతో దాడి చేశారు. స్థానికుల సమాచారం మేరకు మున్సిపల్ ఆఫీసులో పని చేస్తున్న ఓ ఉద్యోగి రాయల్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంలో ఉద్యోగిని ఢీకొన్నాడు. కింద పడిన ఉద్యోగిపై మరో కొందరు కత్తులతో దాడి చేశారు. పట్టపగలు కావడంతో అక్కడే ఉన్న స్థానికులు కొంత మంది అడ్డుకోవడంతో దాడి చేసిన వ్యక్తులు పరారయ్యారు. గాయపడిన బాధితుడిని స్థానికులు హాస్పిటల్ తరలించినట్లు సమాచారం. అయితే జరిగిన హత్యాయత్నం పై రాత్రి వరకు యూనివర్సిటీ పోలీసులకు బాధితులు, తన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని సమాచారం.



తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం కల్పవృక్షవాహనంలో కరుణాంతరంగుడుగా దర్శనమిచ్చారు

### ఎల్‌వీఎం3 - ఎం3 ప్రయోగానికి

## లాంచ్ రిహార్సల్స్

- నేడు షార్‌లో ఎంఆర్ఆర్ సమావేశం
- రేపు ఉదయం నుంచి షార్‌లో కౌంట్‌డౌన్
- వన్‌వెబ్ ఇండియా-2 మిషన్‌పై అందరి దృష్టి



శ్రీహరికోట (తడ), మార్చి 23 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో భారత బాహుబలి రాకెట్ విద్యుత్ వెలుగుల మధ్య అంతరిక్షానికి ఎగిరేందుకు సిద్ధంగా ఉంది. ఇందుకు సంబంధించి గురువారం ఉదయం ఇస్రో శాస్త్రవేత్తలు లాంచ్ రిహార్సల్స్‌ను పూర్తి చేశారు. శుక్రవారం కీలకమైన ఎంఆర్ఆర్ సమావేశం, లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశాలు జరిపి రాకెట్ ఖచ్చితమైన ప్రయోగ సమయాన్ని నిర్ధారిస్తారు. ప్రస్తుతానికి ఆదివారం ఉదయం 9 గంటలకు షార్‌లోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి రాకెట్‌ను ప్రయోగించాలని అంచనా వేశారు. ఇందుకు 24 గంటల ముందు అంటే శనివారం ఉదయం 9 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభిస్తారు. ఈ కౌంట్‌డౌన్‌లో రాకెట్‌లోని కోర్ స్టేజిలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపుతారు.

**643 టన్నుల బరువైన రాకెట్**

ఎల్‌వీఎం3 రాకెట్ మూడు కీలక దశలను కలుపుకొని ఏకంగా 643 టన్నుల బరువు కలిగి ఉంది. మొత్తం 36 వన్‌వెబ్‌వారి ఉపగ్రహాల బరువు 5805 కిలోలుగా ఉంది. ఈ రాకెట్ ఐదు టన్నులు కన్నా బరువైన ఉపగ్రహాలను అంతరిక్షంలోకి మోసుకెళ్లడానికి భారత శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇటువంటి భారీ బాహుబలి రాకెట్లను ఇప్పటికి ఐదింటిని విజయవంతంగా ప్రయోగించి ఉన్నారు. 6వ విజయం కోసం శాస్త్రవేత్తలు ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్‌గా దీన్ని రూపొందించారు. రాకెట్‌కు బలమైన రెండు ఘన ఇంధన స్ట్రాపాన్ మోటార్లు ఒక్కొక్కటి 200 టన్నులు బరువు కలిగి ఉంది. వీటి మధ్య దశలో ద్రవ ఇంధన మోటారు 110 టన్నులుగా ఉంది. మూడవ దశలో 25 టన్నుల క్రయోజనిక్ దశను ఏర్పాటు చేశారు. 43.5 మీటర్ల పొడవు కలిగిన ఈ ఎల్‌వీఎం3 రాకెట్ నిటారుగా అంతరిక్షంలోకి దూసుకెళ్లడానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. భారత శాస్త్రవేత్తలు వాణిజ్య లాభాలను కాంక్షించి వన్‌వెబ్ వారితో ఒప్పందం కుదుర్చుకొని ఈ ప్రయోగం చేపట్టారు.

**ఇది వన్‌వెబ్‌కు 18వ ప్రయోగం**

గత మూడేళ్లుగా యూకెకు చెందిన వన్‌వెబ్ సంస్థ ప్రపంచంలోని వివిధ అంతరిక్ష ప్రయోగ కేంద్రాల నుంచి తమ శాటిలైట్లను ప్రయోగించుకుంటోంది. ప్రస్తుతం ఎల్‌వీఎం3 ద్వారా ప్రయోగిస్తున్న ఉపగ్రహాల శ్రేణి 18వ సారి జరుగుతుండటం విశేషం. భారత్‌తో ఒప్పందాలు కుదుర్చుకోవడమే ఒక మైల్‌స్టోన్‌గా వన్‌వెబ్‌వారు ఇదివరకే ప్రకటించి ఉన్నారు. వన్‌వెబ్ జన్1 శాటిలైట్స్ ఇబ్బడిముబ్బడిగా అంతరిక్షంలో చేరి పలు దేశాలకు తమ సాంకేతిక ఫలితాలను కమర్షియల్‌గా అందించనున్నాయి. ఇదిలావుంటే ఈ రాకెట్ ప్రయోగం తర్వాత 1182 సెకన్లకు అంతరిక్షంలో ఉపగ్రహాలను విడిచిపెట్టేలా శాస్త్రవేత్తలు ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నారు. భూమికి 450 కిలోమీటర్ల దూరంలోని సర్క్యులర్ లోఎర్త్ ఆర్బిట్‌లో ఈ ఉపగ్రహాలను మన ఎల్‌వీఎం3 రాకెట్ ప్రవేశపెట్టనుంది.

## ఉపాధి కూలీల డబ్బులు సిబ్బంది స్వాహా

### నకిలీ మస్టర్లతో పనిచేయని వారి పేర్లు నమోదు చేసిన వైనం

చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త

పనులు లేని కూలీలకు పనులు కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధిహామీ పథకం యాదమరి మండలంలో ఉపాధి హామీ సిబ్బందికి వరంగా మారింది. ఉపాధి పనులు చేస్తున్న కూలీల కష్టంను ఏ మాత్రం కష్టపడకుండా నకిలీ మస్టర్లు రూపొందించి కూలీలకు దక్కాల్సిన నిధులను ఉపాధి సిబ్బంది దర్జాగా స్వాహా చేస్తున్నారు. ఈ నిధుల స్వాహాలో మండల ఉపాధి సిబ్బంది పై స్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు వున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూలీలు ఉపాధి పనులు చేసే సమయంలో ఇంజనీరింగ్ కన్సల్టెంట్, అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్లు తనిఖీలు నిర్వహించాల్సివుంది. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలు చేసే పనులను పర్యవేక్షించాల్సి వుంటుంది. ఇదంతా సక్రమంగా జరిగితే ఉపాధి పనులు చేసే కూలీలకు సక్రమంగా చేపిన పనికి డబ్బులు అందుతుంది. ఇందులో ఏ ఒక్కరు నిర్లక్ష్యం వహించినా ఉపాధి పనుల్లో భారీ అక్రమాలు జరిగే అవకాశం వుంటుంది. యాదమరి మండలంలో ఇదే జరిగింది. ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ఎపిఓ, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి పనులను సక్రమంగా తనిఖీలు చేయకపోవడంతో నిజంగా కూలీ పనులు చేసిన కూలీలకు తీనని అన్యాయం జరిగింది. ఉపాధి పనులకు సంబంధం లేని వారికి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు కుమ్మక్కై మస్టర్లు పెట్టడంతో వారి బ్యాంకు ఖాతాల్లో ఉపాధి నిధులు జమ అయ్యాయి. క్షేత్ర స్థాయిలో కష్టపడి పనులు చేసిన కూలీలకు తీరని అన్యాయం జరిగింది. యాదమరి గ్రామంకు చెందిన ఉపాధి కూలీలు 4.21 లక్షల రూపాయల వ్యయంతో మంజూరైన పూలకంద్రి చెరువు పనులను గత ఏడాది డిసెంబర్ నెలలో ప్రారంభించారు. కూలీలు ప్రతిరోజు పనులు చేస్తున్నప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్ రెండు వారాల మస్టర్లను పెట్టలేదు. కూలీలు పనులు చేస్తున్నప్పటికీ మస్టర్లు ఎందుకు పెట్టలేదని టెక్నికల్ అసిస్టెంట్ అడుగలేదు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ఎపిఓలు పట్టించుకోలేదు. అక్కడ చేయడానికి పని వున్నప్పటికీ ఇక్కడ ఇకపై పని లేదని ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పడంతో కూలీలు అక్కడి నుండి పని కోసం హౌసింగ్ లేఅవుట్ నుండి పూలకంద్రిగ చెరువు వరకు పనులను జనవరిలో ప్రారంభించారు. అయితే ఈ పనులను అప్పటికే కొంత పని ఫీల్డ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలోని కొంతమంది కూలీలు చేసి వుండటంతో మిగిలిన పనులను యాదమరి ఉపాధి కూలీలు చేపట్టి పూర్తి చేశారు. ఇక్కడ యాదమరి ఉపాధి కూలీలు 136 క్యూబిక్ మీటర్ల పని చేసినా ఒక్క రూపాయలు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ సైతం ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గాని, ఎపిఓ గాని టెక్నికల్ అసిస్టెంట్ కాని తనిఖీ చేయలేదు. ఉపాధి పనుల తనిఖీకి ఎవ్వరు రాకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ కుమ్మకై పని చేయని ఇతరుల పేర్లను మస్టర్లలో



నమోదు చేసి వారే పనులు చేసినట్లు నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకొని స్వాహా చేశారు. అక్కడ పని పూర్తి అయ్యిందని చెప్పడంతో యాదమరి కూలీలు దోనిరేవులపల్లి గ్రామ సమీపంలో కాలువ పనులు చేశారు. ఇక్కడ సైతం ఉపాధి కూలీలతో పనులు చేయించుకొని పనులు చేయని వారి పేర్లతో మస్టర్లు పెట్టుకొని ఉపాధి సిబ్బంది నిధులు స్వాహా చేశారు. ఇలా ఉపాధి సిబ్బంది పనులు చేసిన కూలీలకు వారి కష్టానికి కూలీ డబ్బులు ఇవ్వకుండా పని చేయని వారి పేర్లతో మస్టర్లు పెట్టుకొని ఈ మూడు నెలలుగా 50 వేల రూపాయల మేరకు కూలీల డబ్బులను తమ జేబులను నింపుకొన్నారు. ఇది మండల పరిధిలో ఒక్క యాదమరి పంచాయతీ పరిధిలో ఒక కూలీ బ్యాచ్ చేసిన పనులు మాత్రమే. ఈ ఒక్క కూలీ బ్యాచ్ చేసిన పనుల్లోనే మూడు నెలల్లో ఉపాధి సిబ్బంది 50 వేల రూపాయల మేరకు స్వాహా చేసి వుంటే మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల్లో ఏ మేరకు అక్రమాలు జరిగి వుంటాయో తలచుకొంటేనే భయమేస్తుంది. మండల ఉపాధి హామీ అధికారులే ఉపాధి కూలీల డబ్బులను పనులు చేయని వారి పేర్లను మస్టర్లలో నమోదు చేసి తమ జేబులు నింపుకొన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పూర్తి స్థాయిలో తనిఖీ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం వుంటుంది. డ్వామా అధికారులు ఆ మేరకు చేస్తారని ఆశిద్దాం.

### బడ్జెట్ అంచనాలపై

## స్టాండింగ్ కమిటీ ఆమోదం

### మేయర్ శిరీషా, కమిషనర్ అనుపమ అంజలి



బడ్జెట్ అంచనాలపై చర్చిస్తున్న మేయర్, కమిషనర్, అధికారులు

తిరుపతి కార్పొరేషన్, మార్చి 23, ప్రభాతవార్త

తిరుపతి నగర పాలక సంస్థ 2023-24 సంవత్సరంకు సంబంధించి బడ్జెట్ అంచనాలు, అదే విధంగా 2022 - 23 ఆర్థిక సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలపై చర్చించి శనివారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టి కౌన్సిల్ ఆమోదంతో వెల్లడం జరుగుతుందని తిరుపతి మున్సిపల్ కార్పరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెడుతున్న బడ్జెట్ విషయాలపై గురువారం సాయంత్రం నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటి సభ్యులు పాల్గొని చర్చించడం జరిగింది. ఆదాయ వనరులను పెంచేలా చర్యలు తీసుకోవాలని, కాలి స్థలాల యాజమానులను గుర్తించి ఆ స్థలాలకు పన్నులు విధించి కార్పొరేషన్‌కు ఆదాయం పెంచేలా చూడాలని చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె బాబు, నరసింహచారి, గణేష్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కెఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగంలు పాల్గొని చర్చించారు.

### నిర్ధేశించుకున్న గడువులోపు

## గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలి

- గ్రౌండ్ ట్రూతింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- హద్దురాళ్లు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి
- సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్



తిరుపతిరూరల్, మార్చి23 ప్రభాతవార్త:

లక్ష్యాల మేరకు గ్రామాల్లో నిర్ధేశించుకున్న గడువులోగా రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సిసిఎల్ఏ కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రటరీ రీ సర్వే కార్యచరణ అమలు తదితర అంశాలపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుండి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జె.సి.డికె.బాలాజీ, డిఆర్వో శ్రీనివాసరావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరేన్స్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల తనిఖీ, గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో చేట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్ ఏరియల్ ఫ్లయింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. సరిహద్దు కన్వర్మేషన్, ఏరియా వ్యాలిడేషన్, సర్వే పూర్తి, ఫైనల్ రెవెన్యూ రికార్డు నిర్ధేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండింగ్ ట్రూతింగ్ ఫైనల్ ఆర్ఓఆర్, 13 నోటిఫికేషన్ తదితర ప్రక్రియలన్నీ కూడా పురోగతి కనిపించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరేన్స్ అనంతరం కలెక్టర్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లాలో 1050 గ్రామాల్లో గాను 250 గ్రామాల్లో డ్రోన్‌ల ద్వారా రీ సర్వే ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన గ్రామాల్లో కూడా పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

### ఒక్కొక్క ఉద్యోగికి 3 నుంచి 6 బాధ్యతలు

## అప్పగిస్తే పని చేయగలరా?

### పలుకుబడి ఉంటే ఒకే డ్యూటీ : లేకుంటే బహు డ్యూటీలు
### శ్రీకాళహస్తీశ్వరాలయం తీరే వేరు



శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త

లీడ్ (శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన రోజు రోజుకు ఒక్కొక్క సంచలనం సృష్టిస్తుంది. ఒక్కొక్క సీటులో ఒక్కరు పనిచేస్తుంటే అంతంత మాత్రం గా ఉంటుంది. అయితే ఒక్కొక్కరికి బహుబాధ్యతలు అప్పగిస్తే ఏ పనికీ న్యాయం చేయని స్థితి చోటు చేసుకుంటుందని చర్చ జరుగుతుంది. అయితే పలుకుబడి ఉంటే ఒక్కొక్క సీటు లేకుంటే వెట్టి చాకిరి పరిస్థితి చోటు చేసుకుంది. ముఖ్యంగా శ్రీశైలం నుంచి వచ్చిన వారిపై పని భారం పెరుగుతుంది. దాంతో వారు స్వామీ మేము పని చేయలేం సెలవులో వెళతాము అని ఇఒకు మొరబెట్టుకుంటున్నారు.)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వారానికి, 15రోజులకు, నెలకొకమారు బదిలీలు చేస్తున్నారు. అయితే పరిపాలనా నిర్వహణ, పారదర్శకత, జవాబుదారి తనం, క్రమశిక్షణ పేరుతో బదిలీల జాతర సాగుతుంది. ఏ దేవస్థానంలో అయినా మూడు నెలలకొకమారు ఆర్నెల్ల కొక మారు బదిలీలు చేయటం ఆనవాయితిగా మారింది. అయితే ఇలా చేస్తే పరిపాలన సజావుగా సాగుతుందా? అనే చర్చ చోటు చేసుకుంది. దేవాలయాల్లో అందరికి సమ న్యాయం, నీతి, నిజాయితి అంటూ మన పూర్వీకులు చెబుతారు. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో 'పలుకుబడి ఉంటే ఒకే డ్యూటీ' లేదంటే బహుడ్యూటీలు నిర్వహిస్తున్నారు. నేడు ఒక్కొక్క ఉద్యోగి 3 నుంచి 6 బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దాంతో పలువురు ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వహించలేక సెలవుల మీద వెళ్ళి వారు కొందరు అయితే కోర్టును ఆశ్రయించిన శ్రీశైలం ఉద్యోగులు కోర్టు ఉత్తర్వులతో తమ స్వస్థలానికి వెళ్ళటానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే గత ఏప్రిల్‌లో సాధారణ బదిలీల్లో శ్రీశైలం నుంచి 22 మంది రాగా ఇక ఇక్కడ నలుగురు మాత్రమే మిగిలారు. వారు కూడా వెళ్ళటానికి కోర్టు ఉత్తర్వులను ఉపయోగించుకుంటున్నట్లు చర్చించుకుంటున్నారు.

**బహుసీట్ల బాధ్యత అప్పగిస్తే ఎలా?**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉద్యోగుల పరిస్థితి పరిశీలిస్తే ఒక్కొక్కరు ఎన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నారనేది అర్థమౌతుంది. ఇక్కడ పని చేస్తున్న సూపరింటెండెంట్ ఆరుసీట్లను పర్యవేక్షించాల్సి వస్తుంది. జనరల్, రెవెన్యూ, ప్యాకింగ్, రాహుకేతు దోష నివారణ పూజల పర్యవేక్షణ, స్కిట్ కళాశాల పర్యవేక్షణ, సబ్‌టెంపుల్స్, లీగల్, గోశాలను అప్పగించారు. ఒక ఉద్యోగి ఇన్ని బాధ్యతలు నిర్వహించగలరా? ఏ సీటుకు అయినా న్యాయం చేయగలరా? అనేది చర్చనీయాంశంగా మారింది. మరో సూపరింటెండెంట్ కు టెంపుల్, సిఎస్ఓ, అన్నదానం పర్యవేక్షణ అప్పగించారు. ఒకదానికొకటి సంబంధం లేని బాధ్యతలు ఎలా నిర్వహిస్తారు. ఒక సూపరింటెండెంట్‌కు ఏమో ఎలాంటి విధులు కేటాయించకుండా సంతకం పెట్టి జీతం తీసుకోమన్నట్లు చేసారు. ఒకప్పుడు ఈ సూపరింటెండెంట్ హవా సాగింది. రాజకీయ నాయకులు కూడా నెత్తినపెట్టుకున్నారు. సీనియర్ అసిస్టెంట్‌కు ప్రసాదాల తయారి శివసేవకుల పర్యవేక్షణ బాధ్యతను అప్పగించారు. ఓ మహిళా ఉద్యోగికి మూడు సీట్లు కేటాయించారు. పేబిల్స్, పెన్షన్లు, అకౌంట్ మరియు అడిట్ అభ్యంతరాలు పర్యవేక్షించాలి. ఒక సీటు నిర్వహించటానికే సమయం చాలని రోజుల్లో ఒక్కొక్కరికి ఐదారు సీట్లు కేటాయిస్తే వారు ఏ డ్యూటీ అయినా సమర్థవంతంగా పని చేయగలరా? న్యాయం చేయగలరా? అని చర్చించుకుంటున్నారు. దాంతో ఆలయంలో పనుల నిర్వహణలో జాప్యం చోటు చేసుకుంటుంది. జూనియర్ అసిస్టెంట్లను పట్టుమని ంరెండుమూడు నెలలు ఓకూడా ఒక సీటులో పని చేయనివ్వటం లేదు. దాంతో ఎక్కడి పనులు అక్కడ నిల్చి పోతున్నాయి.

## కొండపై షాపింగ్‌కాంప్లెక్స్‌కు పార్కింగ్ సమస్య!

### రోడ్డుపైనే వాహనాలు -భక్తుల ఇక్కట్లు



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

ఇదేదో మారుమూల పల్లెటూర్లోనో...పట్టణశివార్లలో ఎదురవుతున్న సమస్యఅనుకుంటే అందరూ పొరబడినట్లే. సాక్షాత్తు కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలకొండపై నిత్యం భక్తులతోబాటు విఐపిలు, వివిఐపిలు రాకపోకలుసాగించే ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ ఉన్న ప్రధాన రోడ్డుమార్గం. ఆ ప్రాంతంలో వందల సంఖ్యలో దుకాణాలు...రోజువారీగా లక్షల రూపాయల వ్యాపారం..వెరసి భక్తుల వాహనాలేగాక స్థానికుల, వ్యాపారుల వాహనాల పార్కింగ్‌కు స్థలం కనిపించదు. పెద్ద సంఖ్యలో వాహనాలన్నీ రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో షాపింగ్‌కు వెళ్ళే భక్తులు, ప్రధాన కల్యాణకట్టకు చేరుకోవడానికి, లేపాక్షికూడలి నుంచి ఆలయానికి, రాంభగీచా బస్టాండుకు నడిచి వెళ్ళే భక్తులు వాహనాల మధ్య భయంతో వెళ్ళాల్సి వస్తోంది. ఇక్కడ భక్తులు ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా ద్విచక్రవాహనంగానీ, ఇతర వాహనాలు గానీ ఢీకొనే ప్రమాదం ఉందంటే ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. పైగా పాదచారులైన భక్తులు కూడా ఎస్వీషాపింగ్‌కాంప్లెక్స్ ముందుభాగంలో రోడ్డుపైనే నడవాల్సివస్తుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళుతున్నారు. నిత్యం ఇక్కడ నరకప్రాయంగా మారిందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులకు కనీసం పార్కింగ్ సదుపాయం కూడా కల్పించడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెంకన్న దర్శనానంతరం సామాన్యభక్తులేగాక డబ్బున్న భక్తులు కూడా తిరుమలయాత్ర గుర్తుగా వుండేలా ఏదో ఒక వస్తువును కొనుగోలుచేయడానికి సుముఖత చూపుతుంటారు. ఇలా ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు వచ్చిన భక్తులకు వాహనాల మధ్య ప్రయాణం కష్టంగా మారింది. షాపింగ్‌కాంప్లెక్స్‌లోనే పలు జాతీయబ్యాంకులు కూడా ఉన్నాయి. వేలాదిమంది భక్తులు షాపింగ్‌కు వస్తుండటంతో వాహనాలు రోడ్డుపైనే ఆపివెళ్ళాల్సి వస్తోంది. మరీ వ్యాపారులు కూడా తమ వాహనాలను ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రోడ్డుపైనే నిలిపేస్తున్నారు.

### ఉష్ణోగ్రతలు
23/3/2023



- తిరుపతి 28 డిగ్రీలు
- చిత్తూరు 29 డిగ్రీలు
- కుప్పం 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 28 డిగ్రీలు
- వెంకటగిరి 29 డిగ్రీలు
- గూడూరు 29 డిగ్రీలు

### బంగారం ధరలు
23/3/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,540

24క్యారెట్స్ 1గ్రాము రూ.6,043

### కోడిగ్రుడ్ల ధరలు
23/3/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

– నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ ప్రకటనపై హర్షం



కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చిత్రపటానికి రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ వైద్యం శాంతారాం అధ్వర్యంలో నాయీ బ్రాహ్మణులు పాలాభిషేకం చేశారు. కదిరి నియోజకవర్గంలో జరిగిన బిసిల సదస్సులో నారా లోకేష్ నాయీ బ్రాహ్మణులకు తప్పకుండా ఎమ్మెల్సీ సీటు కేటాయిస్తామని చెప్పడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు మోసం చేశారన్నారు. కార్పోరేషన్ ఏర్పాటుచేసి మూడేళ్లు అయినా ఒక్కరూపాయి నిధులు కేటాయించలేదన్నారు. అలాగే 610 ఆలయాల్లో డైరెక్టర్ పోస్టులు కేటాయిస్తామని జిఓ తెచ్చినా ఆచరణలో జాప్యం చేస్తున్నారన్నారు. ఆలయ పాలకమండళ్లలో నాయీ బ్రాహ్మణులకు వెంటనే డైరెక్టర్లుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసారి తెలుగుదేశం పార్టీకి నాయీ బ్రాహ్మణులు అండగా నిలుస్తామన్నారు. ఈసందర్భంగా ఆయన పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, ఎపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, యువనేత నారా లోకేష్, బిసి అధ్యక్షుడు కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

## రహదారుల నిర్మాణ పనులు వేగవంతం

– జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:

జిల్లా అభివృద్ధికి తోడ్పడే జాతీయ రహదారుల నిర్మాణ పనులను వేగవతం చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం ఎన్‌హెచ్ 71, పీలేరు–కాలూరు రోడ్డు పనులకు సంబంధించి జెసి డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ రొంపిచెర్ల మండలం బొంబాయిగారిపల్లి, బండకిందపల్లి, పెద్దగొట్టిగల్లు, సదుం మండలం ఊటుపల్లిల్లో పెండింగ్‌లో వున్న రోడ్డు పనులను త్వరితంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ పనులు వేగవంతంగా చేపట్టి పూర్తి చేయడంపై సంబంధిత తహసిల్దార్లు ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు. ఈ సందర్భంగా జెసి పెండింగ్‌లో వున్న ప్రతి రోడ్డుకు పనుల కారణాలను అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, కలెక్టరేట్ జి,ఇ సెక్షన్ సూపరిటెండెంట్లు వెంకటేశ్వర్లు, మురళి, పులిచెర్ల తహసిల్దారు అమరనాధ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహన ఛోరీ.. దుండగులు అరెస్ట్

–రూ॥4.50లక్షల విలువ చేసే 11 ద్విచక్రవాహనాలు స్వాధీనం

నాగలాపురం, మార్చి23, ప్రభాతవార్త:



ద్విచక్ర వాహనాల ఛోరీలకు పాల్పడుతున్న నలుగురు దుండగులు పట్టుబడినట్లు డిఎస్పీ రామరాజు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్టేషన్ కార్యాలయంలో ఆయన పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఐ హనుమంతప్ప తమ సిబ్బందితో కలిసి నాగలాపురం తూర్పు ఆర్చీ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన నేపధ్యంలో అటువైపుగా రెండు ద్విచక్రవాహనాల్లో నలుగురు అతివేగంగా వస్తుండటం గమనించి, అదుపులోకి తీసుకుని విఛారించగా వారు ద్విచక్ర వాహన ఛోరీలకు పాల్పడుతున్నట్లుగా తెలిసిందన్నారు. మండల పరిసర గ్రామాలకు చెందిన అజయ్(20), వినోద్‌కుమార్(20), విష్ణు(19), ప్రత(32)లు సులభ తరహాపద్ధతిలో డబ్బును సంపాదించి, జాల్సాలు చేసేందుకు ఛోరీలకు పాల్పడినట్లు విఛారణలో తెలిసిందన్నారు. వీరు ఛోరీచేసి దాచిఉంచిన 11 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు. వీటి విలువ రూ॥4.50 లక్షలు ఉంటుందన్నారు. నిందితులుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహన ఛోరీలకు పాల్పడుతున్న దుండగులను పట్టుకోవడం ప్రతిభను కనపరిచిన సిఐ శివకుమార్‌రెడ్డి,ఎస్ఐ హనుమంతప్ప, పోలీస్ సిబ్బందిని డిఎస్పీ అభినందించారు. రివార్డులను అందజేశారు.

## కుప్పం..వి.కోటలో వేయింగ్ మిషన్లు మంజూరు

– ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి

కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త



రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ అధ్వర్యంలో కుప్పం, వి.కోటలో వేయింగ్ మిషన్లు ఏర్పాటు కు కమీషనర్ వీర పాండ్యన్ అంగీకరించార ని ఎపిసిఎస్‌సి డైరెక్టర్ మైసూరు శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం విజయవాడలో జరిగిన ఎపి పౌరసరఫరాల శాఖ పాలకమండలి సమా వేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కుప్పం, వి.కోట ప్రాంతాల్లో సివిల్ సప్లైస్ గోడౌన్లు ఉన్నాయని ఇక్కడ నుంచి వివిధ మండలాలకు బియ్యం, ఇతర నిత్యావసరాలు సరఫరా అవుతాయన్నారు. ఈ నేపథ్యంలో తూకాల్లో తేడాలు రాకుండా ఉండేందుకు వేయింగ్ మిషన్లు ఏర్పాటుచేయాలని కోరడంతో కమీషనర్ సానుకూలంగా స్పందించార న్నారు. లబ్ధిదారులకు నిత్యావసరాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలి

–పలమనేరు వర్కింగ్ జర్నలిస్టులు



పలమనేరు,మార్చి 23,ప్రభాతవార్త:

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని పలమ నేరు వర్కింగ్ జర్నలిస్టులు డిమాం డ్ చేశారు.గురువారం సేవ్ జర్నలి జం డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఎపియూడబ్ల్యూజే)పిలుపు మేరకు పలమనేరు ఆర్డీఓ శివయ్యకు జర్నలి స్టుల సమస్యలపై స్థానిక జర్నలిస్టు లు వినతిపత్రం అందించడం జరిగింది.ఈ మేరకు సీనియర్ పాత్రికేయులు ఆదిశేషయ్య,శ్యామ్,లోకనాథ్ మాట్లాడుతూ సంపాదకులు,జర్నలిస్టుల స్వతంత్రతను కాపాడాలని,ప్రతీకార రాజకీయాల నుండి ప్రకటనల జారీని తొలగించాలని కోరారు. జర్నలిస్టులు,మీడియా సంస్థలపై దాడులను ఆపాలని, కేంద్రం,రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు.రైల్వేలో అన్ని రాయితీలను పునరుద్దరించాలని,అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్‌ను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వీరుల త్యాగం వెలకట్టలేనిది

పెద్దపంజాణి,మార్చి 23,ప్రభాతవార్త:



వీరుల త్యాగాలు వెలకట్టలేనిదని నాగిరెడ్డిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి పేర్కొన్నారు.అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో అమరవీరుల చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్ల వయసులో దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన వీరులు భగత్ సింగ్,రాజ్‌గురు,సుఖ్‌దేవ్‌లన్నారు.ఇలా దేశం కోసం చిన్న వయసులో ఉరికంబం ఎక్కిన వీరి వీరత్వం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత,వాణిశ్రీ,హేమంత్,రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జాతీయ యువ స్వచ్ఛంద సేవా కార్యకర్తలకు ఆహ్వానం

చిత్తూరురూరల్, మార్చి 23 ప్రభాతవార్త:

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సమితిలకు యువజన, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల యందు సేవాభావంతో జాతీయ యువ స్వచ్ఛంధ సేవా కార్యకర్తలుగా పనిచేయుటకు యువతీ యువకుల నుంచి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అభికారి బి. ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–29సంవత్సరాల వయస్సు కలిగి, పదవతరగతి విద్యార్హతతో స్వచ్ఛంద సేవ చేసే స్వభావం కలిగివుండాలన్నారు. ఈనెల 24వ తేది లోపు అభ్యర్థులు www.nyks.nic.in వెబ్‌సైట్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అతిధి ఉపన్యాసకులకు ఆహ్వానం

చిత్తూరురూరల్, మార్చి 23 ప్రభాతవార్త:

పివికెయన్ ప్రభుత్వ కళాశాల నందు అతిధి ఉపన్యాసకులుగా పనిచేయుటకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ధరఖాస్తులు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ డా.జి.ఆనందరెడ్డి తెలిపారు. కళాశాల నందు యుజి, పిజి తరగతులకు బోధించుటకు తెలుగు, గణితం, కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, హార్టికల్చర్, జువాలజీ, బోటనీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీలు వున్నాయనీ, అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తప్పని సరి చేసివుండాలనీ పిహెచ్‌డి/సెట్/నెట్ బోధనానుభవం వున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ధరఖాస్తులను ఈనెల 31లోపు చేసుకోవాలనీ, ఇతర వివరాలకు సెల్‌నెం.9393117566ను సంప్రదించాలని కోరారు.

## వినాయకస్వామి ఆలయానికి రూ.60వేల విరాళం

చిత్తూరురూరల్, మార్చి 23 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణం న్యూ బాలాజీ కాలనీలో వెలసిన పంచముఖి వినాయకస్వామి ఆలయ అభివృద్ధికి మాజీ కౌన్సిలర్ పార్థసారధినాయుడు రూ. 60వేలు విరాళం అందజేసారు. అలాగే ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు అందజేస్తానని నిర్వాహకులకు తెలిపారు. కాగా ఆయనను ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తల మండలి సభ్యులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్యకర్తలు శక్తి వేల్‌స్వామి, ఏ.సి. మాధవనాయుడు, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన

– డిఆర్ఓ రాజశేఖర్

చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:

డ్రగ్స్ వినియోగిస్తే కలిగే నష్టాలపై యువతకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. డిఆర్ఓ సమావేశహాలులో గురువారం విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఎడి శ్రీనివాస్, జిల్లా ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి దయాసాగర్, స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి నాగశైలజలతో కలిసి డ్రగ్స్ కట్టడికి మాస్టర్ శిక్షణ ద్వారా విద్య, వైద్య, స్త్రీ శిశుసంక్షేమశాఖ, ఎక్సైజ్ అధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఓ మాట్లాడుతూ మత్తుపదర్థాలు, డ్రగ్స్ బారిన యువత పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. డ్రగ్స్, మత్తు పదర్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రముఖ కూడలి ప్రాంతాల్లో, ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డ్రగ్స్‌ను కట్టడి చేయడానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడం జరిగిందన్నారు. ఇందులో విద్య, వైద్య, స్త్రీ శిశు సంక్షేమ, ఎక్సైజ్ శాఖ, స్వచ్ఛంధ సంస్థలతో కలిసి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 15 సంవత్సరాలు పైబడిన యువత ఎక్కువగా డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో విద్య, వైద్య, ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి రంజాన్ ఉపవాసదీక్షలు

కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త

ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గురువారం సాయంత్రం నెలవంక దర్శనం ఇవ్వడంతో శుక్రవారం వేకువజామునుంచి ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులు చేపట్టనున్నారు. గురువారం రాత్రి నుంచే మసీదుల్లో తరావీహ్ నమాజు ప్రార్థనలను మత గురువులు ప్రారంభించారు. నెలరోజుల పాటు ముస్లింసోదరులు నియమనిష్టలతో రమజాన్ ఉపవాసదీక్షలు చేపడతారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మా భూములకు పరిహారం పెంచితేనే భూములిస్తాం

కోట, మార్చి 23 ప్రభాతవార్త

కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామ రైతులకు సంబంధించిన భూములను సాగరమాల రోడ్డు నిర్మాణం కోసం తీసుకుంటున్నారని, అయితే పరిహారం విషయంలో మాత్రం తమకు అన్యాయం చేస్తున్నారని ఆ గ్రామ మాజీ జలసంఘం అధ్యక్షులు నేదురుమల్లి హరిప్రసాద్‌రెడ్డితో పాటు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేఖరులతో మాట్లాడుతూ సాగరమాల రోడ్డు నిర్మాణం కింద మా భూముల్లో సర్వే జరిపి భూములు తీసుకునేందుకు పరిహారం జాబితాను కూడా అధికారులు ప్రకటించారని చెప్పారు. ఒక ఎకరాకు రూ.9.40 లక్షలు పరిహారం ఇస్తామని ప్రకటించారని, అయితే ఈ పరిహారం ఏ ఒక్కరూ తీసుకోవడానికి సిద్దంగా లేరన్నారు. మా భూముల సాగుబడి సామర్థ్యాన్ని బట్టి ఎకరా రూ.14 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ధర పలుకుతుందన్నారు. ఈ భూముల ద్వారా సాగు చేసుకొని తమ కుటుంబాలు జీవనం పొందుతున్నామని తెలిపారు. మా భూముల మధ్యలో భూభాగం రోడ్డు పథకానికి సమీకరించుకోవడానికి తాము సాగు చేసుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం తాము కోరిన విధంగా పరిహారం ఇవ్వలేకపోతే మండలంలో ఏ రెవెన్యూ గ్రామంలో అయినా సమాన విస్తీర్ణం కలిగిన సాగు భూములను తమకు మంజూరు చేయాలని నేదురుమల్లి హరిప్రసాద్‌రెడ్డి కోరారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కొత్తపాలెం రైతులకు పరిహారం విషయంలో పున:పరిశీలించాలని కోరారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ప్రాంగణ ఎంపికలు

కోట, మార్చి 23 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో బిటెక్ ఫైనలియర్ చదువుతున్న కంప్యూటర్, ఐటి, ఈసిఈ విద్యార్థులకు గురువారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బెంగళూరుకు చెందిన లుమెన్ టెక్నాలజీస్ వారు ప్రాంగణ ఎంపికలను వర్చువల్‌గా నిర్వహించారు. ఈ ఎంపికలకు ముందుగా వీరికి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిందు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు హాక్స్‌డాన్ విధానంలో రెండో రౌండ్ నిర్వహించారు. తర్వాత వీరికి టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్లు నిర్వహించి ఏడుగురిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం 7.5 లక్షలు ఇవ్వనున్నట్లు కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషందర్ తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రాంగణ ఎంపికలు కాస్త మందగమనంలో ఉన్నప్పటికీ కళాశాలకు ఇప్పటివరకు 26 కంపెనీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో అధిక వేతనంలో ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులను విజయకుమార్‌రెడ్డి అభినందించారు. ఎంపికైన విద్యార్థులు లక్ష్మీప్రియ, వర్షిత, రమాదేవి, మునీష, ధనశేఖర్, చైతన్య, దొరసానమ్మ ఉన్నారు.

## పేద బ్రాహ్మణ కుటుంబానికి ఆర్థిక చేయూత

కోట, మార్చి 23 ప్రభాతవార్త

కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో అర్చకత్వంతో జీవనం సాగిస్తూ ప్రమాదంలో తుంటి ఎముక ఆపరేషన్ జరిగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కోన సాయిబాబా స్వామికి శ్రీసీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయం, ఫల సరుకులు, కూరగాయలు కలిపి రూ.14 వేలు అందజేసినట్లు ఆ సంస్థ ప్రతినిధి దివి అనంతబాబు తెలిపారు. ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ప్రవాస భారతీయులు మధుకిరణ్‌రెడ్డి, శేషాద్రిశర్మ, నారాయణరావు, సాయికల్యాణ చక్రవర్తి, నాగరాజు, నందకిషోర్ శర్మల సహకారంతో ఈ సహాయాన్ని అందజేసినట్లు అనంతబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్‌శర్మ, సుశాంతి, రాజా, మీనాక్షి, పవన్, వెంకటేశ్వర్లు, చలపతిస్వామి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్

కోట, మార్చి 23 ప్రభాతవార్త

కోట మండలంలోని గూడలి, కోట గ్రామాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపిడిఓ మారెళ్ల భవాని తెలిపారు. గురువారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ, అభ్యర్థులు పదోతరగతి పాసై ఉండాలని, గ్రామ వాలంటీర్లుగా ఏ గ్రామ పంచాయతీలో పనిచేయాలని ఆశిస్తారో ఆ గ్రామ పంచాయతీకి చెందిన వారై ఉండాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. క్రమశిక్షణతో, నిజాయితీగా సేవ చేయదలచుకున్న వారే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. కోటలో రెండు, గూడలిలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 28న దరఖాస్తుల పరిశీలన ఉంటుందని తెలిపారు. వాలంటీర్లుగా ఎంపికైన వారు 29 నుంచి విధి నిర్వహణలో ఉండాల్సి ఉంటుందని ఎంపిడిఓ తెలిపారు.

## గ్రంధాలయానికి పుస్తకాలు వితరణ

సూళ్లూరుపేట, మార్చి 23 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీరామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు ఎన్ఆర్ఐవిఎ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల గ్రంథాలయానికి 500 పుస్తకాలను గురువారం బహూకరించారు. సూళ్లూరుపేటకు చెందిన ఎన్ఆర్ఐలు డాక్టర్ సముద్రాల రాములు, డాక్టర్ సుశీల అమెరికాలో ఉన్నారు. వారి సంస్థ ద్వారా సూళ్లూరుపేటలోని కాళంగి శ్రీనివాసులు చేతుల మీదుగా ఈ పుస్తకాల పంపిణీ జరిగింది. పుస్తకమిత్ర అనే కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా పలు పాఠశాలలకు పుస్తకాలు అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రామకృష్ణ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు కమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరమే.. అయినా పట్టించుకోరు

– పట్టణంలో ఆర్‌అండ్‌బి రోడ్డు దుస్థితి

సూళ్లూరుపేట, మార్చి 23 ప్రభాతవార్త



ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు. ఎన్నో ఏళ్లుగా జాతీయ రహదారి నుంచి పట్టణంలోని ప్రవేశించే ప్రధాన మార్గమైన ఆర్‌అండ్‌బి రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉన్నా పట్టించుకునే వారే కరవయ్యారు. స్మశానం వద్ద నుంచి పోలీసుస్టేషన్ వరకు ఆర్‌అండ్‌బి రోడ్డు మొత్తం పెద్ద గుంటలమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులకు తరచూ ఈ గుంటల బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంత మంది అధికారుల దృష్టికి తీసు కొచ్చినా కంటితుడుపు చర్యలు చేపట్టడం మినహా శాశ్వత పరిష్కారాన్ని మాత్రం చూపలేకపోతున్నారు. వర్షం వచ్చిందంటే పెద్ద చెరువును తలపిస్తుంది. అప్పుడు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే సాహసంతో కూడుకున్నదే. ఎక్కడ ఏ గుంట ఉందో తెలియడం కష్టం. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై పయనించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఈ మార్గం గుండాలనే ప్రజాప్రతినిధులు, పలువురు విఐపిలు పట్టణంలోకి వస్తూ పోతుంటారు. అయినా వీరికి ఈ రోడ్డు గురించి పట్టదు. ఆర్‌అండ్‌బి వారు మరమ్మతులు చేయాలని మున్సిపాలిటీ వారు చెప్తున్నారు. ఆర్‌అండ్‌బి వారు ఇదేమీ పట్టనట్టు తమపని తాము చేసుకుంటున్నారు. ప్రధాన రహదారి పరిస్థితి ఇలా ఉందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేయడం మినహా ఏమీ చేయలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు,ప్రజాప్రతినిధులుస్పందించిశాశ్వతపరిష్కారంచూపితే ప్రజల ప్రాణాలు కాపాడిన వారవుతారు.

## చెక్కుబౌన్స్ కేసులో జైలుశిక్ష

సూళ్లూరుపేట, మార్చి 23 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో చెక్కు బౌన్స్‌కేసుకు సంబంధించి వి.లీలాకృష్ణారెడ్డి అనే వ్యక్తికి రెండేళ్లు జైలుశిక్ష, రూ.9 లక్షల జరిమానా విధిస్తూ గురువారం స్థానిక మేజిస్ట్రేట్ ఎస్.అనూష తీర్పునిచ్చారు. లీలాకృష్ణారెడ్డి పి.వెంకటేష్ చెక్కు బౌన్స్ కేసు వేయగా మేజిస్ట్రేట్ ఈ తీర్పునిచ్చారు.

## ప్రతి విద్యార్థిని విద్యావంతులు చేయడమే జగనన్న లక్ష్యం

– సర్పంచ్ పంజా వసంతకుమారి

ఓజిలి, మార్చి 23 ప్రభాతవార్త



రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గంలో కిలివేటి సంజీవయ్య పాలన అద్భుతంగా సాగుతోందని ఓజిలి మండలం సగుటూరు సర్పంచ్ పంజా వసంతకుమారి కొనియాడారు. అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే సంజీవయ్య అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో సిమెంటు రోడ్లు, డ్రైనేజిలు ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మారాయని ఆమె అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ అందరికీ కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న ధ్యేయంతో అమ్మఒడి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారన్నారు. విద్యార్థులపై మరింత శ్రద్ధ వహించి పౌష్టికాహార లోపం లేకుండా మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు తెచ్చారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను మళ్లీ గెలిపించుకోవాలని ప్రజలను కోరారు.

## వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైంది

ఓజిలి, మార్చి 23 ప్రభాతవార్త




అధికార వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైందని మండల అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, నాయకులు కంకణాల వరప్రసాద్‌నాయుడు అన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన ఎమ్మెల్యే కోటా ఎంఎల్‌సి టీడీపీ అభ్యర్థిగా పంచుమర్తి అనురాధ విజయంతో చరిత్ర సృష్టించారని తెలిపారు. టీడీపీకి 23 ఓట్లు రావడం రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సంకేతం అన్నారు. ఈ సందర్భంగా వారి నివాసం వద్ద పార్టీ శ్రేణులు కలిసి మిఠాయిలు పంచుకున్నారు. పంచుమర్తి అనురాధ విజయానికి కృషి చేసిన ప్రతి ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు.

## చిట్టేడులో పోషణ పక్వాడా కార్యక్రమం

కోట, మార్చి 23 ప్రభాతవార్త

కోట మండలం చిట్టేడులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకుంటే మంచి పోషకాలు అందుతాయని అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం తప్పకుండా గర్భిణులు, బాలింతలు తీసుకుంటే రక్తహీనత తలెత్తదని పేర్కొన్నారు. పెరటితోటలు వేసుకుంటే కల్తీలేని కూరగాయలు మనకు లభిస్తాయని, దీంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, జయశ్రీ, సుధామాధవి, రేణుక, స్వాతి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత ఉగాది కేలండర్ల పంపిణీ

కుప్పంరూరల్, మార్చి 23 ప్రభాతవార్త



త్రైత సిద్ధాంత ఉగాది కేలండర్లను గురువారం కుప్పం పట్టణంలో పంపిణీ చేశారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ఈ కేలండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణ, ప్రకాష్, కృష్ణారెడ్డి, శరవణ, శివ, మంజునాథ్ శెట్టి, కృష్ణన్న తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయ సాధనకోసం పోరాడుదాం

తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



భగత్‌సింగ్ ఆశయసాధనకోసం పోరాడాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.భారతీ అన్నారు. గురువారం భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఐఎఫ్‌టి యు కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.భారతీ ఆధ్వర్యం లో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆలోచన విధానం ప్రకారం దేశంలోని ఉద్యోగ కార్మిక హక్కుల పరిరక్షణ కోసం, కనీస వేతనాల పెంపు కోసం దేశంలో జరుగుతున్న మత విద్వేషాలకు ఉన్మాద దాడులకు వ్యతిరేఖంగా పోరాడాలన్నారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్ధుల పట్ల ఉద్యోగ కార్మికుల పట్ల చిన్నచూపు వహించడం సరైందికాదన్నారు. దేశంలో ఉద్యోగ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు కోడ్లను తీసుకురావడం హేయమైన చర్య అన్నారు. నాడు వీరే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం కావాలని 23ఏళ్ళ వయస్సులోనే ఉరికంబాన్ని ముద్దాడిన నవయువ కిశోరాలు ఆలోచనా ప్రకారం సామ్రాజ్యవాదం నశించాలన్నారు. దేశంలో రాష్ట్రంలో స్కీము వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు, ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యావ్యతిరేఖ విధానాలకు వ్యతిరేఖంగా నవయువకులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో పోరాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రజలు రైతులు కార్మికులు విద్యార్ధులు నిరుద్యోగులు ఉద్యోగ కార్మికులు వారి సమస్యల పరిష్కారంలో తీవ్రమైన జాప్యం జరుగుతుందన్నారు. ఈసమస్యలపై వీరి ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర కోశాధికారి కెవి.రమణ, రాష్ట్ర నాయకులు కౌసల్య, ఏ.గణపతి, ఎన్.కుప్పయ్య, పి.మాతయ్య, లక్ష్మిపతి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల సమస్యలను పరిష్కరించండి:

ఆర్‌డిఓ కార్యాలయంలో వినతి



శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త

సమాజానికి కళ్ళు, చెవుల్లాంటి పత్రికా రంగంలో పని చేస్తున్న వారు సవాలక్ష సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యల పరిష్కారానికి గురువారం 'సేవ్ జర్నలిజం' దినోత్సవం సందర్భం గా జాతీయ ఇండియన్ జర్నలిస్టు యూ నియన్ పిలుపు మేరకు శ్రీకాళహస్తిలోని పాత్రికేయులు ప్రెస్‌క్లబ్ సారధ్యంలో ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆందోళనే చేపట్టారు. ఆర్‌డిఓ కెయస్ రామారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల నుంచి పత్రికా రంగాన్ని కాపాడాలనికోరారు. సంపాదకులు, పాత్రికేయుల స్వేచ్ఛను కాపాడాలన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై నిష్పక్షపాత విచారణలు జరగాలని డిమాండ్ చేసారు. ఉపా చట్టం నుంచి పాత్రికేయులకు రక్షణ కల్పించాలని, కేంద్ర మీడియా అక్రిడేషన్ కమిటి పునరుద్దరించాలని, రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులకు రద్దు చేసిన రైల్వేల్లో జర్నలిస్టుల రాయితీలను తక్షణం పునరుద్దరించాలని, కోవిడ్‌తో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికి ప్రకటించిన నష్టపరిహారం రూ.5లక్షలను అందించాలని కోరారు. 2023 సంవత్సరానికి అక్రిడేషన్ కమిటిలో జర్నలిస్టులకు బాగస్వామ్యం కల్పించి నూతన అక్రిడేషన్లు మంజూరు చేయాలని, తమిళనాడు తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా ప్రయాణించే వెసులుబాటు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలనికోరారు. శ్రీకాళహస్తిలో కొందరికి స్థలాలు కేటాయించారని వారికి పట్టాలు ఇవ్వాలని, అలాగే అక్రిడేషన్లు కల్గిన జర్నలిస్టులకు ఇప్పటి వరకు కనీసం ఇంటిస్థలాలు ఇవ్వలేదని ఆర్‌డిఓ కెయస్ రామారావు దృష్టికి తెచ్చారు. సమస్యలను సావధానంగా విన్న ఆర్‌డిఓ రామారావు సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కామేష్ సారధ్యంలో శ్రీకాళహస్తికి చెందిన సీనియర్లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అనూరాధ గెలుపుపై హర్షం

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త

పంచుమర్తి అనురాధ ఎంఎల్‌సిగా గెలుపుపై తెలు గుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి) హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఉత్కంఠ భరితంగా జరిగిన ఎంఎల్ఏ కోట ఎంఎల్‌సి ఎన్నికల్లో అనూహ్యంగా తెలుగుదేశం పార్టీ నిలబెట్టిన అభ్యర్థి పంచుపర్తి అనురాధ గెలుపొందడం హర్షణీయం అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అరాచకాలు పరాకాష్టకు నిదర్శనం ఈ గెలుపే నిదర్శనం అన్నారు. బిసి వర్గానికి చెందిన పంచుపర్తి అనూరాధ పార్టీకి విధేయులుగా, పార్టీ కష్టకాలంలో అండగా నిలచినందుకు ఆమె సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం ఎంఎల్‌సిగా అవకాశం కల్పించిందన్నారు. ధర్మానికి లోబడి అనూరాధ విజయానికి ఓట్లు వేసి సహకరించిన శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. బిసి వర్గానికి చెందిన అనూరాధఎంఎల్‌సిగా ఎన్నికపట్ల బిసి వర్గాలలో ఆనందాన్ని హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశంపార్టీలోనే బిసిలకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.

## పవర్‌ఫుల్ పంచ్‌కొట్టిన పంచుమర్తి

-డాక్టర్ ఉమేష్‌రావుమోరే



శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త

రాష్ట్ర శాసనమండలి సభ్యుల కోటా ఏడు నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికలలో మొదటి ప్రాధాన్యతతో 23 ఓట్లు సాధించి అగ్రస్థానంలో నిలబడి పవర్‌ఫుల్ పంచ్‌కొట్టి ఘనవిజయం సాధించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు, బిసి బిడ్డ పంచుమర్తి అనూరాధకు తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు అభినందనలు తెలిపారు. జగన్‌రెడ్డి పనికిమాలిన పాలనకు విసుగెత్తిన తన సొంత శాసనసభ్యులు సైతం తిరుగుబాటుకు నాందిపలికారని ఉమేష్‌పేర్కొన్నారు.

## తాగడానికి గుక్కెడు నీళ్ళు ఇప్పించండి సారూ..



తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త

మండలంలోని మల్లిగుంట గ్రామ దళితవాడలో తాగునీటిలేక కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునేనాధుడు కరువయ్యారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మల్లిగుంగ దళితవాడలో సుమారు వందకుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గత పదిరోజులుగా తాగడానికి నీరులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు మొరపెట్టుకున్నామని అయినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మంచినీటి వసతిని కల్పించాలని కోరుతున్నారు.

## శ్రీసిటీ ఫౌండేషన్‌చే పరీక్షాసామాగ్రి పంపిణీ

సత్యవేడు, మార్చి 23,ప్రభాతవార్త:

శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ఇరుగుళం, మాదనపాళెం జడ్పీ హైస్కూళ్ళ పదవ తరగతి విద్యార్థులకు గురువారం పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. ఏప్రెల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపధ్యంలో, పరీక్షలు రాయడంకోసం ఒక్కోవిద్యార్థికి ఒక రైటింగ్ ప్యాడ్, రెండు పెన్నులు, జామెంట్రీబాక్స్ వితరణగా ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. ఇరుగుళం స్కూల్‌లో 57మంది విద్యార్ధులకు, మాదనపాళెం స్కూల్లో 20మందికి ఈపరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఇందులో రైటింగ్ ప్యాడ్‌లను శ్రీసిటీ రాక్‌వర్త్ పరిశ్రమ ఇచ్చింది. పదవ తరగతి విద్యార్ధులను ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం శ్రీసిటీ ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రశంసిస్తూ, శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన డ్రైవింగ్ అందివ్వడమే లక్ష్యం

-జిల్లా డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్



తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 23 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలోని వివిధ డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ తీసుకునే విద్యార్థులకు నాణ్యమైన డ్రైవింగ్ అందేలా చూడటమే తమ అసోసియేషన్ లక్ష్యమని జిల్లా డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ వజీర్ బాషా, సోంపల్లి శేఖర్‌నాయుడులు స్పష్టం చేశారు. గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో తిరుపతి జిల్లా డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా షేక్ వజీర్ బాషా, కార్యదర్శిగా సోంపల్లి శేఖర్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా కోలా మురళి, సంయుక్త కార్యదర్శిగా గౌరిపాటి మోహన్, కోశాధికారిగా రెహమాన్ రవతార్ ఫాజుల్, కార్యనిర్వాహక సభ్యులుగా రఘునాథ్, రాజేష్ అద్దంకి, గుంటూరు రాజేశ్వరి, డిజె.జాన్, విజయ్‌కుమార్, వెంకట శ్రీధర్, తదితర సభ్యులతో కలిపి 40 మందిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ రవాణా శాఖ నిర్వహించే 'సఫర్' (రోడ్డు భద్రతా వారోత్సవాలు)లో భాగంగా తమ అసోసియేషన్ తరపున సభ్యులు పాల్గొని ప్రమాదరహిత డ్రైవింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా జిల్లాలోని ఏ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులకైనా ఏదేని సమస్య వచ్చినా తమ అసోసియేషన్ ముందుండి ఆ సమస్యలను పరిష్కరిస్తుందన్నారు.

## పది విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత సేవలు

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 23 ప్రభాతవార్త:

ఏప్రిల్ నెల 3వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఉదయం 9-30 నుండి 12-45 గంటల వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏపిఎస్‌ఆర్టీసీ విజయవాడ కేంద్ర కార్యాలయం, ఆపరేషన్ విభాగం విద్యార్థులను ఉచితంగా పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లాలని ఆయా జిల్లా ప్రజా రవాణా అధికారులకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పరీక్ష రాసే అభ్యర్థులు అన్ని పల్లెవెలుగు అలాగే సిటీ ఆర్డినరీ బస్సుల్లో తమ హాల్ టిక్కెట్లు చూపి పరీక్షా కేంద్రాల వరకు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఈ సదుపాయం కేవలం పరీక్ష రాసే రోజుల్లో మాత్రమే ఉంటుందన్నారు. కండక్టర్లు సైతం విద్యార్థులకు సహకరించాలని సూచించారు. ఈ మేరకు జిల్లాలోని 11 డిపోల మేనేజర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కావున పరీక్షలు రాసే విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తిరుచానూరు పంచాయితీకి 2.55 కోట్ల ఆదాయం

తిరుచానూరు, మార్చి 23 ప్రభాతవార్త:



తిరుచానూరు టూరిస్ట్ బస్టాండ్ వేలంపాట ద్వారా పంచాయితీకి 2 కోట్ల 55 లక్షల 32 వేల రూ॥లు ఆదాయం వచ్చింది. గురువారం పంచాయితీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టూరిస్ట్ బస్టాండ్ వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ ప్రారంభ ధర 2.27 కోట్లు నిర్ణయించి వేలంపాటను ప్రారంభించారు. ఈ వేలంపాటలో తిరుచానూరుకు చెందిన దేవేంద్రరెడ్డి, దామినేడుకు చెందిన నాగిరెడ్డి అనే గుత్తేదారులు పోటీపడ్డారు. చివరకు 2 కోట్ల 55 లక్షల 32 వేలకు అత్యధికంగా వేలం పాడి నాగిరెడ్డి వేలంపాటను దక్కించుకున్నారు. అలాగే పంచాయితీ దుకాణాలకు సంబంధించి వేలంపాట నిర్వహించగా, పోటీదారులు ఎవరూ రాకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ఈఓపిఆర్‌డి నీలకంఠేశ్వరరెడ్డి, పంచాయితీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మునీంద్ర, చంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, వాసు, మునిరత్నంరెడ్డి, ఎంపిటిసి యోగానందరెడ్డి, ముళ్లపూడి సర్పంచ్ సురేష్‌రెడ్డి, గ్రామస్తులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఎస్‌ఆర్‌కు ఘన సత్కారం

రేణిగుంట, మార్చి 23 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం తారకరామా నగర్ వైసీపీ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులరెడ్డి(ఎంఎస్‌ఆర్) తమ నాయకుడు అంటూ తారక రామానగర్ వాసులు ఆయనను గురువారంఘనంగా సత్కరిం చారు. తారకరామానగర్ అభివృద్ధి కోసం అహర్నిశలు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వైసీపీ మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డి ఆదేశాల మేరకు కృషి చేస్తున్న ఎంఎస్‌ఆర్ తమ నాయకుడు పేర్కొంటూ పొగడతలతో ముంచెత్తారు. ఎలాంటి విబేధాలు ఏర్పడిన చాకచక్యంగా పరిష్కరించ కలిగిన నాయకుడిగా అభివర్ణించారు. ఆయన నాయకత్వంలో తారక రామానగర్ అభివృద్ధి చెందుతుందని ఎంపీటీసీ కన్నయ్య, వైసీపీ నేతలు కాలేషా, జిలాని, రాజేష్, రవీంద్ర, రమేష్, తులసి, అమ్ములమ్మ, వాసవి, వార్డు మెంబర్లు తహసీన, షాహిదా, విజయలక్ష్మి, శ్రీ శోభ, స్వర్ణలత, కవిత తదితరులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎంఎస్‌ఆర్‌ను ఘనంగా సన్మానించి అందరికి మిఠాయిలు పంపిణీ చేశారు.

## శ్రీరామనవమికి టూరిజం ప్రత్యేకప్యాకేజీ టూర్

తిరుపతి, మార్చి 23ప్రభాతవార్త:



శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఒకరోజు ప్రత్యేక టూర్‌ప్యాకేజీ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పర్యాటక సంస్థ తిరుపతి డిఎం ఎం.గిరిధర్‌రెడ్డి తెలిపారు. శ్రీరామనవమి మార్చి 30వతేదీ తిరుపతి నుంచి నందలూరు, ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయం సందర్శనకు ఒక్క టిక్కెట్ 600 రూపాయలుగా తెలిపారు. ఉదయం 8గంటలకు తిరుపతిలో బస్సు బయలు దేరుతుందన్నారు. అలాగే ఏప్రిల్ 5వతేదీ ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణం సందర్భంగా 5వతేదీ మధ్యాహ్నం 3గంటలకు తిరుపతి నుంచి ప్రత్యేక ప్యాకేజీ బస్సు బయలుదేరుతుందన్నారు. వివరాలకు 9848007033 నంబర్ కు సంప్రదించాలని డిఎం గిరిధర్‌రెడ్డి కోరారు.

# తిరుపతి డివిజన్

## పోలీస్‌స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్న పత్రాలు

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 23 ప్రభాతవార్త:

వచ్చే నెల ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు స్థానిక మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌లు ముని సుబ్రహ్మణ్యం, దయాకర్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లు వెంకటరమణ, శ్రీనివాసులు, భద్ర పరచినట్లు ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ,బీ రెండు కేంద్రాల్లో పరీక్షలు జరగనుండగా ఏ కేంద్రంలో 201 మంది విద్యార్థులు, బీ కేంద్రంలో 193 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 394 మంది విద్యార్థులు రెండు కేంద్రాల్లో ఈ ఏడాది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

## పోషకాహారంపై అవగాహన

వడమాలపేట, మార్చి 23 ప్రభాతవార్త:



పిల్లలకు పోషక విలువలున్న ఆహారం, విటమిన్లు లభించే వాటిని అందించడం వల్ల బలంగా, ఆరోగ్యంగా పెరుగు తారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కిరణ్మయి పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషక పక్షోత్సవాలు ఎస్వీ పురం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందుబాటులో దొరికిపే పోషక విలువలు ఉన్న వాటిని ప్రదర్శించారు. ఉపాధ్యాయుడు రంగయ్య, అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, జ్యోతి, సచివాలయం సిబ్బంది ఉమ, శ్యామల, నిరంజన్, లీలావతి, భూషణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైకుంఠనాథ స్వామి ఆలయంలో కల్యాణోత్సవం

నగరి, మార్చి 23 ప్రభాతవార్త:

మండలంలోని తెరణి వైకుంఠనాథ ఆలయంలో గురువారం స్వామి కల్యాణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనాథ స్వాముల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతోను, ఆభరణాలతోను, పుష్పాలతోను అలంకరించి కల్యాణోత్సవ పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం విచ్చేసిన భక్తులకు పసుపు, తలంబ్రాలు, ప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ నిర్మల డిపుంల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పోషణ్ పక్వాడా సంబరాలు



నగరి, మార్చి 23 ప్రభాతవార్త:

స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మిట్టపాళెం అంగన్‌వాడీకేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటి సందర్శన, ఆహార ప్రదర్శన, తక్కువ ధర న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది తల్లులకు సంపూర్ణ పోషణపై అవగాహన ఏర్పరచారు. ప్రతి దినం ఆహారంలో మిల్లెట్స్ కలిపి తీసుకోవడం వలన కలిగే ఆరోగ్యపరమైన మేలును వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణం

తిరుపతి(విద్య), మార్చి 23, ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఏపిఎస్‌ఆర్‌టిసి ఉచిత ప్రయాణ సౌకర్యాలు కల్పించింది. అందువల్ల విద్యార్థులు వారి టికెట్లు చూపించి ఈ సౌకర్యాలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు నెలవాయి హైస్కూలు విద్యార్థిని దీప ఎంపిక

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 23 ప్రభాతవార్త:

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని నెలవాయి హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న ఉగ్గుమూడి దీప, ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ తెలిపారు. ప్రతి విద్యార్థి ఉగ్గుమూడి దీపను ఆదర్శంగా తీసుకుని ఇటువంటి సదుపాయాలు పొంది మంచి విద్యను అభ్యసించేందుకు శ్రద్ధగా చదువుకుని విద్యాభ్యాసంలో రాణించాలన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 23 ప్రభాతవార్త:

పౌష్టికాహారం తీసుకోవడం వలన కలుగు ఆరోగ్య అభివృద్ధిపై మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ రత్నమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. గర్భవతులు, బాలింతలు, కిషోర బాలికలు, పిల్లలకు పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనత పూర్తిగా తగ్గి ఆరోగ్యవంతులుగా ఉంటారని క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆహార, పౌష్టిక విలువలతోకూడిన ఆహారం తీసుకోవడం వలన బాలింతలు, గర్భవతులు పిల్లలు కిషోర బాలికలు ఆరోగ్య సమస్యలు బారినపడి ఇబ్బందులు పడవలసి వస్తుందన్న అన్నారు. ప్రతి ఒక్కరు అందుబాటులో ఉన్న పౌష్టికాహారంను పరకాలంలో సక్రమంగా తీసుకో కలిగితే ఆరోగ్య సమస్యలను దూరం చేసుకుని రక్తహీనత లేకుండా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. మనం తీసుకుని ఆహారంపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, పౌష్టికాహారంతో కూడిన ఆహారం తీసుకోవడం వలన రక్తహీనతకు గురై అంగవైకల్యం, ఆరోగ్య సమస్యలు ఏర్పడి అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సూపర్‌వైజర్ శిల్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎపిలో వైసిపి పని అయిపోయింది

గాలి భానుప్రకాశ్



పుత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి పని అయిపోయిందని, ఇక ఆ పార్టీని, జగన్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ప్రస్తుతం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయంతో వైసిపి ఇంటి దారి పట్టినట్టేనని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే జగన్‌ను నమ్మడం లేదని, రాష్ట్ర భవిష్యత్ కోసం టిడిపికి జై కొట్టారని పేర్కొన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో, బటన్ నొక్కుడుతో జగన్ చేసిన దగాను ప్రజలు గ్రహించారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోరుకునే వారు రాష్ట్రంలో తుగ్లక్ పాలనకు తెరదించి తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇస్తున్నారని తెలిపారు.

## వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి

విజయపురం, మార్చి 23 ప్రభాతవార్త :



ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకుని వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలని అంగన్‌వాడి సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. గురువారం మండలంలోని విజయపురం దళితవాడలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం పక్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాల ఆవశ్యకతను, ఆకు కూరల ప్రయోజనాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ సుమతి, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి పెట్టండి : కలెక్టర్



తిరుపతిరూరల్, మార్చి23 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పిల్లలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, అధికారులు ఆ దిశగా శ్రద్ద పెట్టి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన ధ్యేయంగా పని చేయాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి సూచించారు. గురువారం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వర్చువల్ విధానంలో పాఠశాల విద్య, మహిళా శిశు సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, స్పందన అంశాలపై సమీక్ష నిర్వహించగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టర్, అధికారులు హాజరయ్యారు. 0-5 సంవత్సరాల చిన్న పిల్లల ఆధార్ నమోదు జిల్లాలో 58శాతం పూర్తయిందని, ప్రధానంగా పిల్లల ఆరోగ్యం, పిల్లలకు అంగన్ వాడీ నుండి సంపూర్ణ పోషణ అందించటానికి ఆధార్ అవసరమని, అవగాహనతో సచివాలయ సిబ్బంది వీరి ఆధార్ నమోదుకు ప్రత్యేక శ్రద్ద పెట్టి పూర్తి చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలలో పోషకాహార లోపం తగ్గించటానికి అవసరమైన ఐరన్ మాత్రల పంపిణి సక్రమంగా అందేలా చూడాలని, తరచూ పర్యవేక్షణ ఉండాలన్నారు. బడి పిల్లల్లో పోషకాహారం లోపం గుర్తించిన పిల్లలకు అదనపు పౌష్టిక ఆహారం అందించాలని, జగనన్న గోరు ముద్దలో అదనంగా రాగి జావ అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ వల్ల అంగన్‌వాడీ ప్రమోషన్స్, ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వంటివి పూర్తి చేయాలని, ఐసిడిఎస్ పి.డిని ఆదేశించారు. పాఠశాలల్లో సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ తరుచూ ఉండాలని, లోపాలను గుర్తించి, పునరుద్దరణ చర్యలు చేపట్టాలన్నారు. స్పందన అర్జీలను సకాలంలో అర్ధవంతంగా పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలు పరిష్కారం కాలేదనే ఫిర్యాదులు రాకూడదని ఆదేశించారు. ఈ సమీక్షలో డిఎల్‌డిఒ సుశీలాదేవి, డిఇఒ శేఖర్, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, ఐసిడిఎస్ పి.డి. జయలక్ష్మీ, ఎస్సీ సంక్షేమ అధికారి చెన్నయ్య, బి.సి.సంక్షేమ అధికారి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణానికి భూసేకరణ పనులు వేగవంతం

**- జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం**

చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త: చిత్తూరు-తర్చూరు జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మా ణాల్లో పెండింగ్‌లో వున్న భూసేకరణ పనులపై గురువారం సాయంత్రం జెసి డాక్టర్ వెంకటేశ్వర్ ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, పిడి కార్తీక్ రెడ్డిలతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ చిత్తూరు, జిడినెల్లూరు, ఎస్ఆర్‌పురం, నగరి, సత్యవేడు, పిచ్చాటూరు మండలాల్లో పెండింగ్‌లో వున్న భూసేకరణ, రహదారి పనులను వేగంగా నిర్వహించడానికి వీలుగా భూసేకరణ చేసి అధికారులకు అప్పగించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో పెండింగ్‌లో వున్న భూసేకరణ పనులపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ డాక్టర్ రేణుక, సూపరిటెండెంట్ వెంకటేశ్వర్, చిత్తూరు, జిడినెల్లూరు, పిచ్చాటూరు, నగరి, సత్యవేడు, ఎస్ఆర్ పురం మండలాలల తహసిల్దార్ల పాల్గొన్నారు.

## విరించి -23 జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి (విద్య), మార్చి 23 ప్రభాతవార్త : మహిళా యూనివర్సిటీని ఇంజినీరింగ్ కళాశాల నిర్వహిస్తున్న విరించి -23 జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్ ఏప్రిల్ 11, 12వ తేదిలో జరుపుటకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో విరించి -23కి సంబంధించిన పోస్టర్, టీజర్, బ్రోచర్, వెబ్‌సైట్‌ని ఉపకులపతి ఆచార్య కె. రాజా రెడ్డి (ఇంచార్జి), రిజిస్టర్ ఎన్. రజిని, ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ పి. మల్లికార్జునచే ఆవిష్కరించారు. విరించి-23లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విరించి కల్చరల్ ఫెస్ట్ కన్వీనర్‌గా ఎ. సుప్రియ(సిఎస్ఈ), కోకన్వీనర్ ఆర్. ప్రియదర్శిని(ఈసిఈ), విద్యార్థినుల కన్వీనర్లుగా యు. స్నేహశ్రీ (సిఎస్ఇ), ఎం. బంగారు లక్ష్మి(ఇసిఇ), వై. నిఖిల (ఈఈఈ), సిహెచ్‌ఎస్‌వి తేజ శ్రీ (మెకానిక్), అధ్యాపక కోఆర్డినేటర్లు పి. జయశ్రీ (సిఎస్ఇ), డా. వి. రాజేశ్వరి (ఇసిఇ), టి. పార్ధవి సాయిశ్రీ (ఈఈఈ), కె. జ్యోత్స్న కల్పన (మెకానిక్), డా. ఎన్. రమాజ్యోతి (బిఎస్ అండ్‌హెచ్) బృందం నిర్వహించనున్నారు.

## 26న అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు లేవు

తిరుపతినగరం, మార్చి 23 ప్రభాతవార్త: స్విమ్స్ రేడియాలజీ విభాగం వారి ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం గర్భిణీ స్త్రీలకు నిర్వహించే పరీక్షలు 26వ తేదీ ఆదివారం నిర్వహించడం లేదని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం నుండి యథాతథంగా గర్భిణీ స్త్రీలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరగుతుందన్నారు.

**నేడు క్షయవ్యాధి నివారణ దినోత్సవం:**

స్విమ్స్ మెడిసిన్ విభాగధిపతి డాక్టర్ అల్లాడి మోహన్ ఆధ్వర్యంలో 24వ తేదీ శుక్రవారం శ్రీపద్మావతి ఓపిడి బ్లాక్ నందు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రామ్ తెలిపారు.

## మురుగునీటిలో తాగునీటి కుళాయి

**-ఇదీ మున్సిపల్ అధికారుల తీరు**



శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త : ఇప్పటికే శ్రీకాళహస్తి పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పలువురు ప్రజలు, చిన్నారులు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు కిటకిటలాడు తున్నాయి. పై చిత్రంలో కనిపిస్తున్నది జయ రామారావు వీధిలోని ఓ టీదుకాణం పక్కనే ఉన్న మురుగునీటి కాలువలో ఉన్న తాగునీటి కుళాయి. కాలువనిండిపోయి మురుగునీరంతా తాగునీటి కుళాయిముందు చేరింది. అసలే ఈ ప్రాంతంలో వర్షం వచ్చిందంటే మురుగునీటి కాలువలు నిండి రోడ్లపై నీరు ప్రవహించడంతో పాటు వీధులన్నీ జలమయం అవుతాయి. ఇటీవలే మున్సిపల్ అధికారులు కాలువపై అక్రమకట్టడాలను తొలగించిన విషయం విదితమే. అయితే ఇవి మళ్ళీ షరామామూలుగా మారాయి.ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా దుకాణదారులు కాలువపై నిర్మాణాలు కట్టుకునేశారు. అయితే అక్రమకట్టడాలు తొలగించడంలో భాగంగా ఈవీధిలో ఉన్న కొందరి తాగునీటి కుళాయి కనెక్షన్లు కట్ అయ్యాయి. వీటిని ఇప్పటి వరకు వీటికి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో పలువురు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ద ప్రజల సమస్యలను తీర్చాల్సిన అవసరం ఉందని కూడా మున్సిపల్ అధికారులు తెలుసుకో వాల్సి ఉంది. టీదుకాణం వద్ద ఉన్న మురుగునీటి కుళాయి వద్ద మురునీటి పైపులైన్‌లో కలుషితం కాకముందే అధికారులు చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది.

## క్యాంపు రాజకీయాలు చేసినా ధర్మంవైపే గెలుపు !

**-ఎమ్మెల్సీ అనురాధ విజయంపై టిడిపి సంబరాలు**



తిరుపతి,మార్చి 23ప్రభాతవార్త: నాలుగేళ్ళ పాలనపై విశ్వాసంకోల్పోయిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్యేలపై నమ్మకం లేక క్యాంపురాజకీయాలు నడిపినా చివరకు ధర్మంవైపే గెలుపు వరించిందని టిడిపి నేతలు సంబరాలు చేసుకున్నారు. గురువారం అమరావతిలో జరిగిన ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీకి 151మంది ఎమ్మెల్యేల బలం,టిడిపికి 23మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. వీరంతా ఎన్నికల్లో ఓటు వేసినా చివరకు టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధకు 23 ఓట్లు రావడంతో గెలుపొందడంపై తిరుపతిలో రాత్రి సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నేతలు విజయకేతనం చూపి బాణాసంచా కాల్చారు.

## రాష్ట్రంలో ఎగరబోయేది తెలుగుదేశం జెండానే

**- చంద్రబాబు కార్యదర్శి మనోహర్ - కుప్పంలో తెదేపా నేతల సంబరాలు**

కుప్పంరూరల్, మార్చి 23 ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎగరబోయేది తెలుగుదేశం పార్టీ జెండాయేనని చంద్రబాబు కార్యదర్శి మనోహర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయం సాధించడం పట్ల గురువారం రాత్రి కుప ్పంలో తెదేపా నేతలు సంబరాలు జరిపారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మరలా చంద్రబాబునాయుడు సిఎం కావడం తథ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే వైకాపాకు గుణపాఠం చెబుతారన్నారు. వైనాట్ పులివెందుల అనే రీతిలో కార్యకర్తలు పనిచేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్రనేత గోపీనాథ్, నేతలు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్,డా॥ వెంకటేష్, త్రిలోక్, మంజునాథ్, ప్రతాప్‌కుమార్, శివ, కౌన్సిలర్లు సోమశేఖర్,వేలు,జిమ్ దాము,జాకీర్, కాణిపాకం వెంకటేష్, నాను, బుజ్జి, నరేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురం :** శాంతిపురంలో తెదేపా నేతలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల సంబరాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి స్వీట్లు పంచారు. గతంలోనే తమ అభ్యర్థి గెలుపు ఖాయమని అధినేత చంద్రబాబు పేర్కొన్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెదేపా విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, ఎల్. నాగభూషణంరెడ్డి, ఆనందనాయుడు, మణి, నాగరాజు, రమేష్, ఆంజనేయరెడ్డి,రాజు,రాజారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనూరాధ గెలుపుపై తెదేపా పార్టీ సంబరాలు



శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ఎంఎల్‌సిగా పంచుమర్తి అనూరాధ ఎన్నికైన సందర్భంగా గురువారం స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో తెలుగుదేశంపార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. తెదేపా నాయకులు పసుపురంగులు చల్లుకుని ఆందోత్సాహాలతో స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష మాట్లాడుతూ ఎంఎల్‌సి పంచుమర్తి అనూరాధ విజయం వైకాపా అరాచకాలకు చెంపపెట్టు అన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ ఎండీకి 'ది మోస్ట్ ప్రామిసింగ్ బిజినెస్ లీడర్స్ ఆఫ్ ఆసియా' అవార్డు




సత్యవేడు, మార్చి 23,ప్రభాతవార్త: ఎకనామిక్ టైమ్స్‌కు చెందిన ఈటి ఎడ్జ్ సంస్థ నిర్వహించిన 'ది ఎకనామిక్ టైమ్స్ ఏషియన్ బిజినెస్ లీడర్స్ కాంక్లేవ్ 2022-2023' 7వ ఎడిషన్ అవార్డ్స్ కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి ప్రతిష్టాత్మక 'ది మోస్ట్ ప్రామిసింగ్ బిజినెస్ లీడర్స్ ఆఫ్ ఆసియా' అవార్డు లభించింది. ముంబైలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రధానం చేశారు. వ్యాపార విస్తరణలో దేశ విదేశాలలో పెనుప్రభావం చూపిన అసాధారణ నాయకత్వా నికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఎకనామిక్ టైమ్స్ అవార్డుపట్ల డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన గ్లోబల్ బిజినెస్ హబ్‌గా శ్రీసిటీని స్థాపించడంలో తమబృందం సమిష్టికృషి, విశిష్ట ఆలోచనా విధానానికి గుర్తింపుగా దీనిని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన కార్పోరేట్ గమ్యస్థానాలలో ఒకటిగా, విదేశీ బహులజాతి సంస్థల పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం గల భారతదేశంలోని తయారీకి పది అత్యుత్తమ ప్రాంతాలలో ఒకటిగా నిలిచిన శ్రీసిటీ, మేక్ ఇన్ ఇండియా ప్రచారానికి నిజమైన చోదకశక్తిగా దేశవిదేశీ ప్రముఖ పరిశ్రమలకు పుట్టినిల్లుగా మారిందన్నారు. నేడు తనకు దక్కిన ఈగౌరవాన్ని తమ టీమ్ మొత్తానికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. కాగా కార్పోరేట్ లీడర్లు, దార్శనికులు సంస్థల పురోగతిలో అసాధారణ ప్రతిభ కనపరిచిన వారిని ఈ కాంక్లేవ్‌లో సత్కరించారు. శ్రీసిటీ ఎండీతో పాటు అమెజాన్ మనీష్ తివారి, ప్యూమా అభిషేక్ గంగూలీ, క్యాస్ట్రోల్ ఇండియా సందీప్ సాంగ్వాన్, డిహెచ్‌ఎల్ సప్లైచైన్ వికాస్ ఆనంద్, టిఎన్ మెర్కంటైల్ బ్యాంక్ ఎస్ కృష్ణన్, బజాజ్ జనరల్ ఇన్సురెన్స్ తపన్ సింఘేల్, ఫోకో ఇండియా హిమాన్షు టాండన్, ఆర్ఈసి వివేక్ కుమార్ దేవాంగన్, లంబోర్గిని ఇండియా శ్రీకృష్ణ, హెక్సావేర్ టెక్నాలజీస్ రామకార్తికేయన్ కూడా ఈఅవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

## మహిళా ప్రాంగణం స్థలం కూడా వదలి పెట్టరా?



శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో కొందరు అధికార పార్టీ ముసుగులో ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఈ నేపధ్యంలో మహిళా ప్రాంగణానికి కేటాయించిన స్థలాన్ని కూడా వదలి పెట్టడం లేదని తెలుగుదేశం పార్టీ ధ్వజమెత్తింది. పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారధ్యంలో ఇటు ఎన్‌టిఆర్, అటు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో ధర్నా జరిపారు.ఈ మేరకు శ్రీకాళహస్తి తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ 1999లో అప్పటి స్థానిక శాసనసభ్యుడు, సాంకేతిక శాఖ,మహిళా సంక్షేమ శాఖ మంత్రి హోదాలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మహిళల కార్యక్రమాలు నిర్వహించుకొనుటకు సర్వే నెంబర్ 185/2లో స్థలం కేటాయించారన్నారు.అప్పటి జిల్లా కలెక్టర్ కృష్ణయ్య సారధ్యంలో మహిళా ప్రాంగణం నిర్మాణానికి నందమూరి బసవతారక మహిళా ప్రాంగణం అని పునాది రాయి కూడా వేసారన్నారు.ఈ స్థలాన్ని ఆక్రమించుకొనుటకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. రూ.కోట్ల విలువ చేసే ఈ స్థలం పై ప్రస్తుతం అధికార పార్టీ మద్దతుతో కొందరు ఆక్రమించుకొనుటకు ప్రయత్నాలు చేస్తున్నారని దానికి నాయకుని మద్దతు కూడా ఉందనే విమర్శలు వినబడుతున్నాయన్నారు.రూ.కోట్ల విలువ చేసే మహిళలకు సంబందించిన భూమిని కబ్జా కోరల నుంచి కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ఈ కార్యక్రమాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్,రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి,రాష్ట్ర తెలుగుదేశంపార్టీ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి రేణుకాదేవి, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం (బుజ్జి), కాసరం రమేష్, కంఠా రమేష్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మిన్నల్‌రవి, షాకీర్ అలి, వెంకటేశ్వరచౌదరి,మాజీ కౌన్సిలర్ బషీర్, ప్రసాద్‌నాయుడు, యాదగిరి,కెవి.ప్రతాప్, మునిరాజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి పిల్లల పాలిట "అమ్మ"!

**పేదపిల్లల జీవితాల్లో మార్పుతెచ్చిన తహసున్నీసాబేగం**




తిరుపతి,మార్చి 22ప్రభాతవార్త: విద్యాకేంద్రంగా....నరస్వతినిలయంగా అలరారుతున్న తిరుపతి నగరంలో వీధిపిల్లలను బడిలో చేర్పించి వారిపాలిట "అమ్మ"గా తహసున్నీసాబేగం నిలిచింది. ఎందరో వీధిపిల్లలు జులాయిలుగా తిరగడం, ఇళ్ళల్లో పాచిపనులు చేయడం వరకే పరిమితమైన వారిని బడికి పంపేలా మార్పు తీసుకువచ్చి, ప్రోత్సాహమిచ్చిన ఆమె వారిపాలిట సరస్వతిదేవిగా కొనియాడబడుతుంది. తిరుపతి నగరంలోని అన్నారావుకూడలిసమీపంలోని ఎస్టీకాలనీలో తీసుకువచ్చిన మార్పుపట్ల ఆ కాలనీవాసులు చేతులెత్తి తహసున్నీసాబేగం సేవానిరతిని కొనియాడుతున్నారు. దాదాపు మూడు సంవత్సరాల క్రిందట నుంచి వీధిపిల్లలను టిటిడి నిర్వహణలోని ఎస్‌వి ఓరియంటల్ పాఠశాలలో చేర్పించి చదువుకునేలా చూశారు. మొదట్లో పిల్లలు కూడా బడికెళ్ళేందుకు మొరాయించేవారు. వారిని అక్కునచేర్చుకుని అమ్మలా లాలించి, వారికి బిస్కెట్లు, చాక్లెట్లు ,రుచికరమైన భోజనం అందించి మంచిగా చదువుకునేలా చూడటంతోబాటు వారికి ఇష్టమున్న ఆటల్లోనూ రాణించేలా ప్రోత్సహించారు. ఇటీవల ఎస్వీ ఓరియంటల్ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులను ఎంఇఓ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

## రోడ్డుకడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలి!

**అమిత్‌షాకు సంబంధం ఏమిటి?... బిజెపి మీడియా ప్రతినిధి కోలా**




శ్రీకాళహస్తిరూరల్, మార్చి 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద నిర్వహిస్తున్న ఇసిఎల్ కంపెనీ చిందేపల్లి గ్రామానికి వెళ్ళె రోడ్డు మీద నిర్మించిన అడ్డగోడను తొలగించాలని ఇక్కడ సంఘటనలతో అమిత్‌షాకు సంబంధం ఏమిటని రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్‌కుమార్ ప్రశ్నించారు. గురువారం రాచగున్నేరి ఇసిఎల్ కంపెనీ వద్ద వివాదాన్ని ఆయన పరిశీలించారు.అలాగే చిందేపల్లి గ్రామస్థులతో చర్చించారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నాటి ల్యాంకో నేటి ఇసిఎల్ తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవటానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేరును ఉపయోగిస్తున్నారన్నారు. తప్పుడు సంకేతాలను పంపుతున్నారని ధ్వజమెత్తారు.ఈ వాదనల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. ఇసిఎల్ నిర్మించిన రోడ్డు, కంచెను తొలగించాలని డిమాండ్ చేసారు.వాస్తవానికి ఇసిఎల్ కంపెనీకి, కేంద్ర హోం మంత్రి, బిజెపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇసిఎల్ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌అండ్‌బి రోడ్డుపై కంచె వేయటం చిందేపల్లి గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బంది కల్గించటం హేయమైన చర్య అన్నారు. బిజెపి నాయకుల అండదండలతోనే మేనేజ్‌మెంట్ ఆర్‌అండ్‌బి రోడ్డుపై గోడ నిర్మించినట్లు జరుగుతున్న ప్రచారాన్ని కోలా ఆనంద్ తిప్పి కొట్టారు. గత ఆరు రోజుల నుంచి ఇసిఎల్ కంపెనీ వద్ద చిందేపల్లి వాసులు నిరసన తెలుపుతుంటే పోలీసులు పికెటింగ్‌లు వేసి భయభ్రాంతుల్ని చేయటం దారుణమన్నారు.ఇదే విషయం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. హైకోర్టులో ఈ వివాదానికి సంబంధించి కేసు నడుస్తుందని ఈ నెల 30 తీర్పువస్తుందన్నారు. ఆలోపే ఇసిఎల్ యాజమాన్యం ఆర్‌అండ్‌బి రోడ్డుపై కంచె వేయటం గ్రామస్థుల హక్కులను కాలరాయటమే అన్నారు.ఇకనైనా ఇసిఎల్ కంపెనీ తమ మొండివైఖరిని విడనాడాలన్నారు.ఈ కార్యక్రమాల్లో బిజెపి నాయకులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, బాలగురవయ్య, ప్రసాద్, కొనేటి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## పచ్చజెండా ఎప్పుడో!? కదలని "104"

**మొబైల్ మెడికల్ క్లినిక్ వాహనాలు!**

**-రెండు వారాలుగా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ప్రాంగణంలోనే ఎదురుచూపు**

ప్రభాతవార్త-తిరుపతి:



మారుమూలగ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం సమకూర్చిన అధునాతన "104"మొబైల్ మెడికల్ క్లినిక్ వాహనాలు డ్రైవర్లు లేక ఎదురుచూస్తున్నాయి. ఈ వాహనాలు తిరుపతి జిల్లాకు చేరి రెండువారాలు కావస్తున్నా ఎక్కడ ఆపినవి అక్కడే నిలబడిపోయాయి. 7 సంచార వైద్యసేవల వాహనాలు తిరుపతి జిల్లాకు కొత్తగా మంజూరయ్యాయి. రెండువారాల క్రిందట ఈ వాహనాలను ప్రభుత్వం ఇక్కడకు పంపింది. ఈ వాహనాలను ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల ప్రాంగణంలో ఉంచారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వాహనాలు కదలకముందే ఇలా నిలబడిపోయాయి. ఈ వాహనాల్లో అత్యవసరమైన వైద్యపరికరాలు, మందులు సమకూర్చుతారు. ప్రతిరోజూ తిరుపతి జిల్లా పరిధిలోని గ్రామాల్లో తిరుగుతూ అక్కడి ప్రజలకు వైద్యసేవలందిస్తాయి. అయితే ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, వైద్యఆరోగ్యశాఖ అధికారులు 104 వాహనాల ప్రాధాన్యతను గుర్తించి ప్రజలకు సేవలందించేలా ప్రారంభిస్తారని ఆశిద్దాం.

## మసీదుల్లో ప్రారంభమైన తరావీహ్‌నమాజులు



శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త : తరంజాన్ మాసం నెలవంక దర్శన భాగ్యం లభించింది.దాంతో గురువారం సాయంత్రం ముస్లిం సోదరుల్లో ఆనందోత్సాహాలు చోటు చేసుకున్నాయి. రాత్రి అన్ని మసీదుల్లో 'తరావీహ్ నమాజులు' ప్రారంభించారు.శుక్రవారం నుంచి 'ఉపవాసదీక్షలు' ప్రారంభమ య్యాయి. యువకులు,వృద్దులు తేడా లేకుండా ఉపవాసదీక్షలకు ఉద్యుక్తులయ్యారు.గురువారం రాత్రి వివిధ మసీదుల్లో దివ్యఖుర్ చదవటంలో నిష్ణాతులైన గురువులు చదవటం ప్రారంభించారు. శ్రీకాళహస్తిలోని మరకస్ (జామియా మస్‌జిద్)లో హాఫీజే ఖుర్ అన్ రేహన్‌సాహెబ్,ఖుబా మస్‌జిద్‌లో మహమ్మద్ అలీ, నూర్ మస్‌జిద్‌లో హాఫీజే ఖుర్ ఆన్ మెలజమ్,మదీనా మస్‌జిద్‌లో అబ్దుల్ హాఫీజ్, ఉమర్‌మస్‌జిద్‌లో జుబాయిర్,అక్సా మస్‌జిద్‌లో హాఫీజే ఖుర్ అన్ ఉమర్, మక్కా మస్‌జిద్‌లో జసీముద్దీన్, యూసుఫ్ మస్‌జిద్‌లో హాఫీజే ఖుర్ ఆన్ నదీమ్‌లు దివ్యఖుర్ ఆన్ పఠనాన్ని ప్రారంభించారు.

తరావీహ్ అంటే ఏమిటి?

రంజాన్ మాసానికి ముందు షాబాన్ మాసం వస్తుంది.ఈ మాసం దైవ ప్రవక్తమహమ్మద్ సొల్లాలాసొల్లం సూచించే మార్గదర్శకాలకు అవకాశం అయితే రంజాన్ మాసం వస్తుందనే ముందు పిలుపుగా చెప్పవచ్చు. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఆచరించే నమాజుల్లో రాత్రి వేళల్లో నిర్వహించే తరావీహ్ నమాజ్ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రతి ఒక్కరు రాత్రి వేళల్లో దివ్యఖుర్ ఆన్‌లోని 30 కాండాల్లో ఒక్కొక్క కాండాన్ని పఠిస్తారు.ఈ నమాజ్‌లను ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఆచరిస్తారు. ఉత్తర భారత దేశంలో ముస్లింలు ఒక నెలలో పది సార్లు దివ్యఖుర్ ఆన్‌ను పఠించి తరావీహ్ నమాజు ఆచరిస్తారు. కానీ తిరుపతిజిల్లాలోని మసీదుల్లో రోజుకొక కాండం చొప్పున పఠిస్తారు. 27 రోజుల్లో 30 కాండాల్ని పూర్తి చేస్తారు. 27వ రాత్రి "షబ్బెఖదర్"అంటారు.

ఉపవాసదీక్షల ప్రాధాన్యత :

దివ్యఖురాఆన్‌లోని సూరా 2-183లో ఇలా పేర్కొనబడింది. విశ్వాసం కల్గిన మానవులారా! పూర్వ ప్రవక్తల అనుయాయులకు ఏ విధంగా ఉపవాస దీక్షలు విధిగా విధించబడ్డాయో అలాగే ప్రస్తుతం ఉపవాసాలు విధిగా పాటించాలని నిర్ణయించినట్లు దీని వల్ల భయభక్తులు కల్గుతాయి. ఇంతటి చారిత్రక ప్రాధాన్యత సామాజిక భావం కల్గినటువంటి ఉపవాసాల ముఖ్యోద్దేశ్యాల్ని, లక్ష్యాల్ని అల్లాహ్ స్పష్టంగా విశదీకరించారు.నైతిక మానవీయ విలువల్ని బాధ్యతా భావాన్ని పెంపొందించుటకే వీటిని ఫరజ్‌గా ఆదేశించారు.ఉపవాస దీక్షల్ని పాటించే వారు కొన్ని నియమనిబంధల్ని ఆచరించాల్సి ఉంటుంది. దినమంతా ఉపవాస దీక్ష ఆచరించే వారు అబద్దమాడరాదు.ఇతరుల్ని దూషించరాదు. ఇతరుల గురించి చెడుగా మాట్లాడరాదు. పరదూషణ చేయరాదు.దేవుని ధ్యానంలో సత్యసంధతతో నడుచుకోవాలి. మానవుడు కామ,క్రోధ,మద,మాత్సార్యాల్ని అణచుకొని దీక్షను పాటించటం వల్ల ఆరోగ్యపరంగా కూడా ఎంతో మేలు చేకూరుతుందని దివ్యగ్రంధాల్లో పేర్కొన్నారు.

**జగదభిరాముడుగా...**

## సర్వభూపాల వాహనంపై అభయం



తిరుపతి, మార్చి 23ప్రభాతవార్త: తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి జగదభిరాముడుగా సీతాలక్ష్మణసమేతుడై భక్తులకు అభయమిచ్చాడు. ఆలయ నాలుగుమాఢవీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు వాహనసేవ ముందు రామ నామస్మరణతో అడుగడుగునా కర్పూరహారతులిచ్చారు. రాజులకు రాజు రాజాధిరాజు సర్వభూపాలునిగా దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ మోహన్, కంకణభట్టార్ ఆనంద కుమార్‌దీక్షితులు, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి, అర్చకులు పాల్గొన్నారు. కాగా ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంలో కరుణాంతరంగడుగా దర్శనమిచ్చారు.